క్లుప్తంగా

జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాల నివారణ



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కోడుమూరు రూరల్: చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని కోడుమూరు అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ మహబూబ్ దౌలత్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని పెట్రోల్ బంకుల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిమాపక పరికరాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా వాహనదారులు అగ్నిప్రమాదాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్ వంటి మండే స్వభావం ఉన్న వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏవైనా అనుకోని ప్రమాదాలు చోటు చేసుకుంటే వెంటనే అగ్ని మాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలన్నారు.

రేపు బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో శుక్రవారం ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు చెన్నారెడ్డి తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో పాలపళ్ల విభాగంలో పోటీలు జరుగుతాయని చెప్పారు. తొలి 10 స్థానాల్లో నిలిచే వారికి వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు, రూ.4 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి గల ఎద్దుల యజమానులు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9573442294, 9704383745 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పుసులూరులో గడ్డివామి దగ్ధం

కల్లూరు: మండల పరిధిలోని పుసులూరు గ్రామంలో మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన శివారెడ్డి గడ్డివామి దగ్ధమైంది. ఉలిందకొండ పోలీసులు విచారిస్తున్నారు.


ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే



సీతారాముల పల్లకోత్సవ సేవలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కల్లూరు అర్బన్ వీకర్ సెక్షన్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, కల్లూరు పరిధిలోని ఆలయాల్లో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా ఆయన సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాముల పల్లకోత్సవ సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, లక్ష్మీరెడ్డి, నాయకులు భీమాశంకర్ రెడ్డి, సుకుమార్, ధర్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో యువనేత కాటసాని శివనరసింహారెడ్డి

కల్లూరు: కల్లూరు అర్బన్ 19వ వార్డుకు చెందిన 15 మంది యువకులు టీడీపీని వీడి బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 19వ వార్డు నాయకులు సుధాకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో యువనేత కాటసాని శివనరసింహారెడ్డి సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కిరణ్ మనోహర్ ఆదిత్య, వరుణ్, హక్, షారుఖ్, బాల మధు, రామ్, సాయి తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలని ఈ సందర్భంగా శివనరసింహారెడ్డి వారికి పిలుపునిచ్చారు.

హద్దుమీరితే కటకటాలే

మహానంది: ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా హద్దుమీరితే కటకటాలు తప్పవని మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. గాజులపల్లె, గాజులపల్లె ఆర్ఎస్ గ్రామాల్లో బుధవారం కేంద్ర బలగాలైన బీఎస్ఎఫ్ జవాన్లతో పోలీసు కవాతు నిర్వహించారు.

కారును ఆపి బెదిరించిన దుండగులు

మహానంది: నంద్యాల నుంచి మహానందివైపు కారులో వెళ్తున్న ప్రయాణికులను తమ్మడపల్లె మలుపు వద్ద గుర్తుతెలియని వ్యక్తులు బెదిరించిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. కారులో వస్తున్న వారిని గంగమ్మ గుడి సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద ఆపి బెదిరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పలువురిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.



కోడుమూరు: సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న పురోహితులు,



అమడగుంట్లలో..



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కమనీయం.. రాములోరి కల్యాణం

- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- కనులపండువగా సీతారాముల కల్యాణోత్సవం
- మిన్నంటిన జైశ్రీరామ్ నామస్మరణ
- రామాలయాల్లో భక్తుల రద్దీ

కోడుమూరు రూరల్: శ్రీరామనవమి వేడుకలను బుధవారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. కోడుమూరులోని రామాలయంలో ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తుల రామ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకీపై కొలువుదీర్చి మేళతాళాల మధ్య పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే సమాజ్ సంఘ సభ్యులు జీతూరి రవి, నాగరాజు, రాంప్రసాద్, బాబు, వెంకటరమణ, వీరన్న, శేఖర్, నాగేందర్, విష్ణు, తిప్పేస్వామి, రమేష్, పట్నం సుధాకర్ పాల్గొన్నారు. అలాగే మండలంలోని క్రిష్ణాపురం గ్రామంలో సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో, అమడగుంట్ల గ్రామంలో పెసలదిన్నె మధుసూదన్‌రెడ్డి, వర్కూరు, బైస్‌దొడ్డి గ్రామాల్లో ఆయా గ్రామ పెద్దలు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు.



కోడుమూరు: స్వామివారి కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

- కనులపండువగా స్వామివారి కల్యాణోత్సవం



ఓర్వకల్లు: స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఓర్వకల్లు: మండలంలోని రామాలయాల్లో సీతారాముల కల్యాణం కనుల పండువగా జరిగింది. ఓర్వకల్లు, హుసేనాపురం, శకునాల, నన్నూరు, పూడిచెర్ల, లొద్దిపల్లె తదితర గ్రామాల్లో ఈఓలు మద్దిలేటి, డీఆర్‌కేవీ ప్రసాద్, సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం జరిపించారు. భక్తులు కనులారా వీక్షించి తన్మయత్వం చెందారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, పానకం పంపిణీ చేశారు.



పాణ్యంలో..



సి.బెళగల్: విశేష అలంకరణలో స్వామివారు

- అంతా రామమయం

సి బెళగల్: శ్రీరామనవమి సందర్భంగా మండల పరిధిలోని మారందొడ్డి, పోలకల్, కె.సింగవరం, ముడుమాల, సంగాల, పల్‌దొడ్డి, గొల్లలదొడ్డి, బురాన్‌దొడ్డి, గుండ్రేవుల కొండాపురం, కొత్తకోట, కంబదహాల్ తదితర గ్రామాల్లో స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సి.బెళగల్‌లోని వాల్మీకి రామాలయంలో వేదమంత్రాలు, భక్తుల రామ నామస్మరణ మధ్య స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. సర్పంచ్ పాండురంగన్న, మాజీ సర్పంచ్ సీబీ వసుంధరమ్మ, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. మారందొడ్డి గ్రామంలో కల్యాణోత్సవం అనంతరం ప్రభోత్సవం నిర్వహించారు. సి.బెళగల్, సంగాల, కొత్తకోట గ్రామాల్లో పల్లకోత్సవం సందర్భంగా పెద్దఎత్తున బాణసంచా కాల్చి సందడి చేశారు.



సి.బెళగల్: ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న నిర్వాహకులు



హాజరైన అశేష భక్తజనం



గూడూరు: బూడిదపాడులో సీతారాముల కల్యాణం



కె.నాగలాపురంలో..

- విశేష పూజలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని బూడిదపాడు, కె.నాగలాపురం, గుడిపాడు, చనుగొండ్ల, తదితర గ్రామాల్లోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. ముందుగా సీతారాముల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఆభరణాలు, పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల మధ్య పురోహితులు కల్యాణ ఘట్టాన్ని జరిపించారు. బూడిదపాడులో చిన్నారుల నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది.

గూడూరు: పట్టణంలోని వాల్మీకి దేవాలయం, తూర్పు బీసీ కాలనీలోని రాములవారి ఆలయం, అంబా భవానీ మాత ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

- మిన్నంటిన జైశ్రీరామ్ నామస్మరణ

పాణ్యం: పాణ్యం రాములవారి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. జైశ్రీరామ్ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అలాగే పాణ్యం, నెరవాడ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులకు పానకం, వడపప్పు అందించారు.

కల్లూరులో..

కల్లూరు: కల్లూరు పంచముఖ ఆంజనేయస్వామి, రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.



బూడిదపాడులో చిన్నారుల నృత్య ప్రదర్శన



పూజలందుకున్న స్వామివారు



మారందొడ్డిలో ప్రభోత్సవం



గూడూరులో..



కల్లూరు: బస్తిపాడులో..

రమణీయం.. రథోత్సవం



వర్కూరులో రాములవారి రథోత్సవం

కోడుమూరు రూరల్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వర్కూరు గ్రామంలో బుధవారం సాయంత్రం రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు సీతారాముల కల్యాణాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించి ఉత్సవమూర్తులను రథంపై ఆసీనులను చేశారు. కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. శ్రీరామచంద్రమూర్తికి జై అంటూ గ్రామస్తులు పెద్ద ఎత్తున కరతాళధ్వనులు చేశారు. కార్యక్రమంలో కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, నాయకులు దస్తగిరి, కేశన్న, దుబ్బన్న, ధర్మారెడ్డి, రమణారెడ్డి, పాపిరెడ్డి, ఐపిరెడ్డి పాల్గొన్నారు.



రథోత్సవంలో కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్

కర్నూలులోనే కోడుమూరు అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ

- రిటర్నింగ్ ఆఫీసర్ శేషిరెడ్డి





మాట్లాడుతున్న కోడుమూరు ఆర్ఓ, కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి, కోడుమూరు ఆర్ఓ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన బారికేడ్లు

కర్నూలు(సెంట్రల్) : కోడుమూరు అసెంబ్లీ అభ్యర్థులు కర్నూలు ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుందని ఆ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్, కర్నూలు ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి తెలిపారు. ఏప్రిల్ 18 నుంచి 25వ తేదీ వరకు (ఆదివారాలు, సెలవు రోజులు మినహాయించి) ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు చెప్పారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మధ్యాహ్నం 3.05 గంటల వరకు ఆర్ఓ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న అభ్యర్థులకు టోకెన్లు ఇచ్చి నామినేషన్‌కు రాత్రి వరకైనా అవకాశం కల్పిస్తామన్నారు. గుర్తింపు పొందిన పార్టీల నుంచి అభ్యర్థి అయినా, లేకుంటే అతని తరఫున అదే నియోజకవర్గానికి చెందిన ఒక ప్రపోజర్ నామినేషన్ వేయవచ్చన్నారు. రిజిస్టర్ పార్టీ లేదా స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లకు 10 మంది బలపరిచే వారు ఉండాలని వివరించారు. నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థులు తమ వాహనాలను ఆర్ఓ కార్యాలయానికి 200 మీటర్లలో నిలుపుదల చేయాలని, అక్కడి నుంచి మూడు వాహనాలను మాత్రమే 100 మీటర్ల దూరం వరకు అనుమతిస్తామన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థితోపాటు నలుగురు వ్యక్తులను మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి వెళ్లాలన్నారు. ఇందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించి నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలన్నారు. అసెంబ్లీ ఎన్నికకు నామినేషన్ వేసే అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.10 వేలు చెల్లించాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు చెల్లిస్తే సరిపోతుందని వివరించారు. సెక్యూరిటీ డిపాజిట్‌ను నగదు రూపంలోనైనా, ట్రెజరీ రిసిప్ట్ ద్వారా చెల్లించవచ్చన్నారు. ఫారం-26లో అభ్యర్థులు వారిపై ఉన్న కేసులు, అప్పులు, ఉద్యోగం, ఇతర అన్ని రకాల వివరాలు నమోదు చేయాలన్నారు. నామినేషన్ ఫామ్‌లో ప్రతి కాలాన్ని పూర్తి చేయాలని, అలాగే తప్పులు లేకుండా అఫిడవిట్ సమర్పించాలన్నారు. అభ్యర్థులు గత పదేళ్లలో ఏదైనా ప్రభుత్వం ఉద్యోగం చేసినట్లైతే ప్రభుత్వానికి ఎలాంటి బకాయిలు లేవని నో డ్యూస్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. దీంతో పాటు అభ్యర్థులు ఫారం-ఏ, ఫారం-బీ ఒరిజినల్ కాపీలను తమకు ఇవ్వాలని తెలిపారు.

సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నామినేషన్

ఎన్నికల సంఘం నామినేషన్లను ఆన్‌లైన్ ద్వారా వేసే అవకాశం కల్పించినట్లు ఆర్డీఓ చెప్పారు. సువిధ యాప్ ద్వారా నామినేషన్ పత్రాలను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చన్నారు. అలాగే ఆన్‌లైన్‌లోనే సెక్యూరిటీ డిపాజిట్, ఈ-అఫిడవిట్‌ను తీసుకోవచ్చన్నారు. అయితే ఆన్‌లైన్ నామినేషన్ ప్రక్రియ ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్లను సమర్పించడంతోనే పూర్తి కాదని, ఆన్‌లైన్ సమర్పించిన పత్రాన్నింటినీ ఫిజికల్‌గా ఆర్ఓకు సమర్పించాల్సి ఉంటుందని, అప్పుడే నామినేషన్ ప్రక్రియ పూర్తి అవుతుందని ఆర్డీఓ వెల్లడించారు.

ఇంటి నుంచే ఓటు

- 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు వెసులుబాటు
- నేటి నుంచి 21వ తేదీ వరకు బీఎల్ఓల ద్వారా అర్హుల గుర్తింపు

పాణ్యం: ఓటు వేయాలనే ఆసక్తి ఉన్నా వయోభారంతో ఇల్లు కదల్లేని వారికి, దివ్యాంగులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక అవకాశాన్ని కల్పించింది. ఓట్ ఫ్రం హోం పద్ధతిలో వీరు తమ ఓటు హక్కును ఇంటి నుంచే వేసే వెసులుబాటు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 18 నుంచి 21వ తేదీ వరకు బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్ఓ) ఇంటింటా తిరిగి హోం ఓటింగ్‌కు అర్హులైన ఓటర్లను గుర్తిస్తారు. వారిని కలిసి హోం ఓటింగ్ ఆప్షన్ తీసుకుంటారా లేదంటే పోలింగ్ కేంద్రంలో ఓటు వేస్తారా అన్న విషయాలను సేకరిస్తారు. అర్హులైన వారు మే 2, 3వ తేదీల్లో ఓటు వినియోగించుకోవాల్సి ఉంటుంది. వీరి వద్దకు సెక్టోరల్ అధికారులు, బీఎల్ఓలు, పోలింగ్ ఏజెంట్లు, సూపర్‌వైజర్లు వెళ్తారు. శరీరం సహకరించలేని వారికి సహాయకులు నియమిస్తారు. ఈ సహాయకులకు కుడి వేలుపై సిరా గుర్తు వేస్తారు. మళ్లీ ఆ సహాయకుడు ఓటు వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమాలు అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తారు. వందశాతం పోలింగ్ నమోదు చేసేందుకు ఎన్నికల కమిషన్ ఓటు హక్కుపై విస్తృతంగా అవగాహన కల్పిస్తుంది.



భూపనపాడులో వృద్ధురాలిని పరిశీలిస్తున్న సెక్టోరల్ అధికారి

పాణ్యం నియోజకవర్గంలో 85ఏళ్లు పైబడి వారి వివరాలు

మండలం	వయో వృద్ధులు	దివ్యాంగులు
పాణ్యం	109	393
గడివేములు	149	471
ఓర్వకల్లు	206	363
కల్లూరు	923	2164
మొత్తం	1387	3391

మరోమారు పరిశీలిస్తాం



ఎన్నికల కమిషన్, ఈఆర్ఓ సూచనల మేరకు మండలంలోని 43 పోలింగ్ కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించాం. ఎక్కడా ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించాం. ప్రతి ఓటరు తమ ఓటును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం మంచానికే పరిమితమైన 85 ఏళ్లు పైబడిన వారికి, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించింది.

–ఫణికుమార్ తహసీల్దార్‌పాణ్యం

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి



బొల్లెద్దుల ఏసేపు(ఫైల్)

పగిడ్యాల: మండల పరిధిలోని పాత ముచ్చుమర్రిలో ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లిన కూలీ వడదెబ్బ బారినపడి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొల్లెద్దుల ఏసేపు(41) ఉపాధి హామీ పథకం కింద పంట కాలువల్లో పూడిక తీత పనులు చేసేందుకు వెళ్లాడు. ఉదయం పని ప్రదేశంలోనే స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు విడిచాడు. మృతునికి భార్య సుజాత, హేమంత్, సుధీర్, చినబాబు పిల్లలు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.